క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ ఎస్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భీష్మానగర్, షిర్డి ఎన్‌క్లేవ్, గండారెడ్డికాలనీ, సాయిగోకుల సాయినగర్, రైతుబజార్, లెనిన్‌నగర్, హుడాకాలనీ, అన్నపూర్ణకాలనీ, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ యాదయ్య తండ్రి, వార్డు మాజీ సభ్యుడు గోరటి జంగయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబాన్ని, ఆదివారం జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కండె హరిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు విక్రంరెడ్డి తదితరులు పరామర్శించారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, అది మంత్రి వర్గ విస్తరణ ద్వారా మరోసారి నిరూపితమైందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు రాష్ట్రంలో ప్రజాపాలన ప్రభుత్వం.. సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా మంత్రి వర్గంలో నూతనంగా చోటు దక్కించుకున్న ఎమ్మెల్యేలు వివేక్, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో పాటు, డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికైన రాంచంద్రు నాయక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి 'వాకిటి'కి శుభాకాంక్షలు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మంత్రి వర్గంలో చోటు దక్కించుకుని, ఆదివారం రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి కాంగ్రెస్ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.రాహుల్‌లు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ సోషల్ మీడియా కన్వీనర్ సాల్కమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం చౌదరిగూడ ఆర్య సమాజంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాలని సూచించారు. కార్యకర్తలందరూ సైనికుల్లా పనిచేసి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కురుమయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాగంటి మరణం తీరని లోటు

షాద్‌నగర్‌రూరల్: జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణం చెందడం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణ ముఖ్య కూడలిలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో మంచి నాయకుడిగా ఎదిగిన మాగంటి గోపీనాథ్ ప్రజలందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఒక మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందని, ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.నటరాజ్, నాయకులు మన్నె నారాయణయాదవ్, లక్ష్మణ్‌నాయక్, చంద్రశేఖర్, వీరేశం, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాఘవేందర్, శరత్‌కృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లన్న కల్యాణం

భారీగా తరలివచ్చిన భక్తులు

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- ఇబ్బంది కలగకుండా నిర్వాహకుల ఏర్పాట్లు



మల్లన్న కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పహాడీషరీఫ్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గల దొంతరాల గుట్టపై శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. నూతనంగా నిర్మించిన మల్లన్న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరేగింపుగా బోనాలతో ఆలయానికి చేరుకొని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆదివారం మల్లన్న కల్యాణ మహోత్సవాన్ని ఒగ్గు పూజారులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కల్యాణంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, ఆలయ ముఖద్వారం నిర్మాణ దాత మారబోయిన రాజుయాదవ్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, మెట్టు కుమార్‌యాదవ్‌ను నిర్వాహకులు యాతం పవన్‌కుమార్‌యాదవ్, పెరమోని నరేశ్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. ఒగ్గు కళాకారుల పర్యవేక్షణలో సూర్యబోనం, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, సాయంత్రం స్వామివారి గడప కడగడంతో ఈ ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సుక్క శివకుమార్, మద్ది సబితారాజశేఖర్‌రెడ్డితో పాటు బండారి గోపాల్‌యాదవ్, గుర్జని గణేశ్‌గౌడ్, లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రాజుయాదవ్, అశోక్ ముదిరాజ్, మల్లారెడ్డి, అమరేందర్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, దశరథ, శంకరయ్యయాదవ్ పాల్గొన్నారు.



బోనాలు తీసుకొస్తున్న భక్తులు



అగ్నిగుండాల వద్ద ఒగ్గు కళాకారులు, భక్తులు

పొదుపుతోనే ఆర్థిక స్వావలంబన

పొదుపు సంఘం అధ్యక్షుడు రవికుమార్

పహాడీషరీఫ్: చిన్న, మొత్తాల పొదుపు ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి పొదుపు సంఘం అధ్యక్షుడు మన్న రవికుమార్ అన్నారు. సంఘం 20వ వార్షిక మహాసభను జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామ కాలనీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్త మార్కండేయ స్వామికి పూజలు చేశారు. 20 ఏళ్లల్లో సంఘం సాధించిన పురోగతిపై సభ్యులు చర్చించారు. ప్రస్తుతం 720 మందితో కొనసాగుతున్న సంఘంలో పొదుపు సంబంధించి పూర్తి పారదర్శకతను పాటిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడిగా ఒగ్గు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్, కోశాధికారిగా కెంచె శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా పున్న విష్ణు, సభ్యులుగా భిక్షపతి, శ్రీనివాస్, రమ్య, గుర్రం నరేశ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపకుడు గుర్రం శ్రీనివాస్, వినాయక పొదుపు సంఘం అధ్యక్షుడు కెంచె లక్ష్మీనారాయణ సంఘం సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు.



వార్షిక సభలో పాల్గొన్న భక్త మార్కండేయ పొదుపు సంఘం సభ్యులు

బహుమతుల ప్రదానం

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విక్రాంత్ బ్యాడ్మింటన్ అకాడమీలో నాలుగు రోజుల పాటు జరిగిన జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్–2025 పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంతర్జాతీయ మాజీ క్రీడాకారిణి, గోపిచంద్ అకాడమీ కోచ్ దీప్తిరెడ్డి, అంతర్జాతీయ మాజీ క్రీడాకారుడు, అంతర్జాతీయ కోచ్ గురుసాయిదత్త ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పి. ఆనంద్‌బాబు, సంయుక్త కార్యదర్శి సాయిరెడ్డి, మాజీ కార్పొరేటర్ సామా ప్రభాకర్‌రెడ్డి, బీఏటీ సంయుక్త కార్యదర్శి యూబీఎస్‌బాబు, రవణారెడ్డి పాల్గొన్నారు.



విజేతలతో దీప్తిరెడ్డి, గురుసాయిదత్త, శ్రీనివాసరావు

ఘనంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ పూజల అనంతరం హోమం, అమ్మవారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొని పూజలు చేశారు. వీరికి ఆలయ నిర్వాహకులు మెమెంటోలు అందించి సన్మానించారు.

గిరిజనులను మోసం చేసిన ప్రభుత్వం

కడ్తాల్: కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేసిందని లంబాడ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్)రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గిరిజన సదస్సుకు ఆయన హాజరుకాకుండా, పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. లంబాడాలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, మాయ మాటలతో మభ్యపెట్టి మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన మాటను నిలుపుకొనే వరకు పోరాటం చేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని, పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీనియర్ పాత్రికేయుడికి పరామర్శ

షాద్‌నగర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీనియర్ పాత్రికేయుడు సంజయ్‌కుమార్‌ను ఆదివారం మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నడికూడ యాదగిరియాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

16వ మహాసభలను విజయవంతం చేయండి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: సీపీఐ పార్టీ మండల 16వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ పేజ్–2 వద్ద ఈ నెల 10వ తేదీన పార్టీ మండల 16వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభలకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నూతన మండల కమిటీని ఎన్నుకోవటంతో పాటు భవిష్యత్తు పార్టీ కార్యాచరణ ప్రకటిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఎం.ప్రభులింగం, సుభాన్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, సత్యనారాయణ, మక్బుల్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యనందించడం అభినందనీయం



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న స్కూల్ సిబ్బంది

బీజేపీ నేత పేరాల శేఖర్‌జీ

నాగోలు: విద్యార్థులకు ఉత్తమ శిక్షణ, విద్యనందిస్తూ వారిని ఉన్నత స్థానాల్లో నిలుపుతున్న రేయాన్ సైనిక్ స్కూల్స్ యాజమాన్యం నిబద్ధతను అభినందించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్‌జీ అన్నారు. ఆలిండియా సైనిక్ స్కూల్–2025 ఫలితాలలో 6, 9వ తరగతి ప్రవేశ పరీక్షల్లో మొదటి ర్యాంక్, 4వ ర్యాంక్‌లతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల సక్సెస్ మీట్‌ను ఆదివారం నాగోలులోని రేయాన్ సైనిక్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి పరీక్షలలో విజయం సాధించిన హనీశ్‌రెడ్డి, అమృత్‌యాదవ్, శ్రీతేజ, సాకేత్, దీక్షత్‌రాజ్‌రెడ్డి, అక్షిత్‌రెడ్డి, అకున్ బాలాజీ, భానుప్రసాద్‌తో పాటు 260పైగా మార్కులు సాధించిన 45 మందిని సన్మానించారు. అదేవిధంగా 9వ తరగతి ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన అశ్వర్థా, ఎన్‌డీఏకు ఎంపికైన జాన్సన్, రూపేశ్, జయంత్, అభిరామ్, రఘునందన్, ప్రణవ్‌లను బీజేపీ జాతీయ నాయకులు శేఖర్‌జీ, స్కూల్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, డైరెక్టర్ ఉమాదేవి అభినందించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రేయాన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. గత 25 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారని, సివిల్ సర్వెంట్స్‌గా, ఇంజనీరింగ్, మెడికల్ విభాగాలు, ఎన్‌డీఏలో అవకాశాలు లభించాయన్నారు. రేయాన్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ.. రేయాన్ స్కూల్‌లో అత్యున్నతమైన విద్యతో పాటు సామాజిక అవగాహన, ఉన్నతమైన విలువలు నేర్పుతున్నామని స్పష్టం చేశారు.

మృగశిర కార్తె సందడి



పహాడీషరీఫ్: బతికున్న చేప దొరికిన ఆనందంలో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి పెద్ద చెరువుకు ఆదివారం మృగశిర కార్తె శోభ సంతరించుకుంది. 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో నీరు పుష్కలంగా ఉండడంతో పెంపకందారులు గత ఆరు నెలల క్రితమే చేప పిల్లలను వదిలారు. దీంతో ప్రస్తుతం ఒక్కో చేప కిలో నుంచి మూడు నాలుగు కిలోల వరకు తూకం పెరిగాయి. జల్‌పల్లి, కాటేదాన్, లక్ష్మీగూడ, పాతబస్తీల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి చేపలను కొనుగోలు చేశారు. తమ కళ్లముందే చెరువులో నుంచి బతికి ఉన్న చేపలను పట్టుకొచ్చి విక్రయిస్తుండడంతో ప్రజలు ఇష్టంగా కొనుగోలు చేశారు. రవ్వ, బొచ్చె, గ్యాస్‌కిట్, పాంప్లెట్‌లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు.

జోరుగా చేపల విక్రయాలు

కందుకూరు: మృగశిర కార్తె వస్తే గ్రామాల్లో పండుగే. వర్షాకాలం ప్రారంభమవడంతో రైతులు సంతోషంగా కార్తె రోజు గడుపుతారు. మరో పక్క కార్తె ప్రవేశించడంతో ఆదివారం చేపలకు డిమాండ్ బాగా పలికింది. కార్తె ప్రారంభమైన రోజున తప్పనిసరిగా మాంసాహార ప్రియులు చేపలను ఆరగించడం ఆనవాయితీ. దీంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో చేపల విక్రయాలు జోరందుకున్నాయి. ఇదే అదునుగా వ్యాపారులు కిలో రూ.200 పైగా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. శాకాహార ప్రియులు బెల్లం, ఇంగువ తినడంతో పాటు అడవుల్లో, పొలాల్లో దొరికే ఆదొండ కాయలతో ప్రత్యేకంగా కూర చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది.



కందుకూరు చౌరస్తాలో చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

బాబోయ్.. భౌభౌలు

- గుంపులుగా గ్రామసింహాల సంచారం
- భయాందోళనలో ప్రజలు



ఆమనగల్లు: పురపాలక సంఘంలో కుక్కల బెడద పెరిగిపోయింది. గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. బాటసారులపై అకారణంగా దాడులకు పాల్పడుతున్నాయి. ద్విచక్రవాహన దారులను వెంబడిస్తూ ప్రమాదాల బారిన పడేస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ఉదయనగర్, ఆదర్శనగర్ కాలనీలలో గ్రామసింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎవరు కంటపడినా గుర్రుమంటూ ఓరగా చూస్తున్నాయి. హడలిస్తే దాడులకు పాల్పడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటినుంచి బయటకు రాలేకపోతున్నామని వాపోతున్నారు. ఇటీవల ఆదర్శనగర్ కాలనీకి చెందిన చిన్నారి రియాజ్‌ఖాన్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని కాలనీ వాసులు తెలిపారు. వాటి భయంతో పిల్లలు ఆరు బయట ఆడుకోలేకపోతున్నారని, ఇంట్లోనే ఉండాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. కొంత కాలం క్రితం శునకాల నియంత్రణకు మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు చర్యలు తీసుకున్నారని, అయినా పదుల సంఖ్యలో కాలనీలలో తిరుగుతున్నాయని చెప్పారు. అంతే కాకుండా పందులు కూడా పెరిగిపోయాయన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి, కుక్కలు, పందుల బెడద నుంచి కాపాడాలని పుర ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై కమిషనర్ శంకర్‌నాయక్‌ను వివరణ కోరగా.. వీధి కుక్కల బెడద గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. అనంతరం వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

చేవెళ్ల: కరాటే ఆత్మరక్షణతో పాటు శారీర దృఢత్వానికి దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. మండల కేంద్రంలోని స్పోర్ట్స్ స్టేడియంలో ఆదివారం జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ కె.కృష్ణ నిర్వహించిన కరాటే శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కరాటే బెల్టుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. అనంతరం శిక్షణ అందించిన మాస్టర్ కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో కరాటే బెల్ట్‌ల చీఫ్ ఎగ్జామినర్, 8వ బ్లాక్ బెల్టు డాన్ ఎండీ ఖాజాపాషా, ఆర్గనైజర్లు బ్లాక్ బెల్టు డాన్‌లు జంగయ్య, రాములు, యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కరాటే మాస్టర్లు, నాయకులు

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీవాసులందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్ బాబర్, మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు అగ్గనూరు బస్వం, వన్నాడ వెంకటేశ్‌గౌడ్, మురళీమోహన్(అప్పి), ప్రవీణ్, బచ్చలి నరేశ్, రవితేజ, మాధవులు, మధు, ముబారక్ అలీఖాన్, మనీశ్, దిలీప్, అర్జున్, లక్ష్మణ్, శ్రీను, మహబూబ్, కిశోర్‌యాదవ్ పాల్గొన్నారు.



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్